పార్లమెంట్ ఎన్నికల్లో మజ్లిస్‌ను ఓడిస్తాం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


గుడిమల్కాపూర్ దాదావాడిలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


బేగంబజార్ సంకల్ప యాత్రలో మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్ తదితరులు


గోషామహల్ బీజేపీ విజయ సంకల్ప యాత్రలో..


గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

గోల్కొండ: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మజ్లిస్ పార్టీని ఓడిస్తామని హైదరాబాద్ పార్లమెంటు స్థానాన్ని కైవసం చేసుకుంటామని కేంద్రమంత్రి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం గుడిమల్కాపూర్ దాదావాడి జైన్ మందిర్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మజ్లిస్ పార్టీపై నిప్పులు చెరిగారు. మైనార్టీ ఓట్ల పేరుతో గెలుస్తూ.. వస్తున్న మజ్లిస్ మైనార్టీలకు చేసిందేమీలేదన్నారు. ఈ విషయం హైదరాబాద్‌లోని పాత నగరాన్ని చూస్తే అర్థమవుతుందన్నారు. హైదరాబాద్ పార్లమెంటు స్థానం గెలుచుకుంటూ.. ఆ పార్టీ ఎంపీ అసదుద్దీన్ ఒవైసి ముస్లింలకు చేసిందేమిటని ప్రశ్నించారు. నేడు పాతనగరం ఎన్నో సమస్యలతో సతమతమవుతుందని, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉన్నాయన్నారు. ఇంటిని చక్కబెట్టుకోలేని అసదుద్దీన్ ఒవైసీ తమది అఖిల భారత పార్టీ అని చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. నేడు దేశం మొత్తం ప్రధాని నరేంద్రమోదీ వెంటే ఉన్నారని అభిప్రాయపడ్డారు. 2014 ఎన్నికల్లో 275, 2019 ఎన్నికల్లో 302, ఈసారి జరిగే పార్లమెంటు ఎన్నికల్లో 370 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ముచ్చటగా మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి ప్రధాని నరేంద్రమోదీ హ్యాట్రిక్ ప్రధాని కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. గత పదేళ్లలో ప్రధాని దేశాన్ని అగ్రదేశాల సరసన నిలిపారని కొనియాడారు. భారత విజయపతాకం ప్రపంచం నలువైపులా కనిపిస్తోందని, దీనికి ప్రధాని మోదీ సమర్థ నాయకత్వమే కారణమన్నారు. నేడు భారత ఆర్థిక వ్యవస్థ ముందు అగ్రదేశాల ఆర్థిక వ్యవస్థలు బలహీనంగా ఉన్నాయన్నారు. బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు పాండుయాదవ్, ప్రధాన కార్యదర్శి డిజ్వర్‌సింగ్ బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ తదితరులున్నారు.

జోరుగా విజయ సంకల్ప యాత్ర..

అబిడ్స్: బీజేపీ విజయ సంకల్ప యాత్ర జోరుగా కొనసాగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ కార్యాలయ ఇన్‌చార్జి డి.గోపాల్‌జీ, గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండుయాదవ్‌తో కలిసి పలువురు నాయకులు ఈ సంకల్పయాత్ర కొనసాగించారు. ధూల్‌పేట్ నుంచి పురానాపూల్, చుడిబజార్, బేగంబజార్, అఫ్జల్‌గంజ్ వరకు పెద్దఎత్తున కార్యకర్తలు తరలిరావడంతో విజయ సంకల్ప యాత్ర కొనసాగింది. మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, కార్పొరేటర్లు లాల్‌సింగ్, డాక్టర్ సురేఖ, శశికళ కృష్ణ, శంకర్‌యాదవ్, కన్వీనర్ కృష్ణ, బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని నినాదాలు చేశారు. 'ఫిర్ ఏక్ బార్' బీజేపీ అంటూ చేసిన నినాదాలు హోరెత్తించాయి.

గోల్కొండ: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో విజయం సాధిస్తామని కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో విజయ సంకల్ప యాత్రను ఆయన మంగళవారం గుడిమల్కాపూర్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో దేశంలోని అత్యధిక పార్లమెంటు స్థానాలు తమ పార్టీ గెలుచుకుంటుందన్నారు. బీజేపీకి అన్ని వర్గాల ప్రజలు జై కొడుతున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ సమర్థ పాలనకు ప్రజలు తమ ఆమోదముద్ర వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో విజయ సంకల్ప యాత్రకు భారీ స్పందన వస్తుందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కాలం చెల్లిన పార్టీ అని, అమలు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను కూడా ప్రజలు నమ్మడం లేదన్నారు. నగరంలోని ఒక ప్రాంతానికి చెందిన మజ్లిస్ పార్టీకి కూడా ఈసారి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి పలు స్థానాల్లో గట్టి పోటీ ఎదురైందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గోల్కొండ బీజేపీ అధ్యక్షుడు పాండుయాదవ్, ప్రధాన కార్యదర్శి డిజ్వర్ సింగ్, కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జి అమర్‌సింగ్, ఇంద్రసేనారెడ్డి, వినయ్‌సింగ్, యోగ్‌రాజ్‌సింగ్, దేవర వంశీ తదితరులున్నారు.

జియాగూడ: దేశం కోసం మోదీ, మోదీ కోసం మనం కలిసి కదులుదాం. మరోసారి దేశ ప్రధానమంత్రిగా నరేంద్రమోదీని గెలిపించుకుందామని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం విజయ సంకల్ప యాత్రలో భాగంగా జియాగూడలో భగత్‌సింగ్ చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండుయాదవ్, కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అమర్‌సింగ్, జియాగూడ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గోల్కొండ జిల్లా డేయిర్‌సెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్, ముచ్చింతల సత్యనారాయణ, రమేష్ చొగ్లే, రామ్‌కుమార్, సురేష్ బిడ్లా, తులసీదాస్, రాజ్‌పోల్, భాస్కర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీకి అత్యధిక పార్లమెంట్ స్థానాలు..

గోల్కొండ: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని ముదోల్ బీజేపీ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. మంగళవారం గుడిమల్కాపూర్‌కు వచ్చిన సందర్భంగా ఆయనను పలువురు బీజేపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తుత్తి వాగ్దానాలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆదరణ కోల్పోయిందని ధ్వజమెత్తారు. సుస్థిర పాలన అందించడం బీజేపీకే సాధ్యమని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా అవినీతి చోటుచేసుకోలేదని అభిప్రాయపడ్డారు. రక్షిత్‌సాగర్, కరుణ, మల్లేష్‌యాదవ్, రామకృష్ణ, దాస్‌సాగర్ తదితరులున్నారు.


ముదోల్ బీజేపీ ఎమ్మెల్యే రామారావుపటేల్ తదితరులు



ధూల్‌పేట్‌లో గోపాల్‌జీ తదితరులు

ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో జాబ్‌మేళా

నాంపల్లి: ఇందిరాప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహించారు. బ్యాంక్ జోన్ ఫైన్ సర్వ్ ప్రైవేట్ లిమిటెడ్, సాఫ్ట్ సొల్యూషన్ కంపెనీలు పాల్గొన్నాయి. ఈ జాబ్‌మేళాలో జరిగే ఇంటర్వ్యూలకు దాదాపు 250 మంది విద్యార్థినులు హాజరయ్యారని టీఎస్‌కేసీ కో- ఆర్డినేటర్ కస్తూరి వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిలో ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఉన్నందున పరీక్షలు పూర్తికాగానే జాయినింగ్ ఉంటాయని ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు ప్రకటించారు. జాబ్‌మేళాలో మొత్తం 125 మంది విద్యార్థినులు ఎంపికయ్యారని వారికి వేతనం ఏడాదికి రూ.2,16000 అందిస్తారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి, టీఎస్‌కేసీ సభ్యురాలు శ్రీదేవి, టీఎస్‌కేసీ ఎఫ్ఐఎం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

నేడు సిటీ కాలేజీలో..

చార్మినార్: ప్రభుత్వ సిటీ కాలేజీలో తెలంగాణ స్కిల్స్ ఫర్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ) ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్ తెలిపారు. దాదాపు 50కి పైగా కంపెనీల్లో ఉద్యోగాల కోసం కళాశాలలో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్

పిన్నీస్‌తో తాళం తీసి..

- ద్విచక్ర వాహనాల చోరీ
- ముగ్గురు సభ్యుల ముఠా అరెస్ట్
- ఐదు బైక్‌లు స్వాధీనం

సుల్తాన్‌బజార్: బుల్లెట్ వాహనాలను టార్గెట్ చేసుకుని పిన్నీసులతో తాళం తీసి వాటిని చోరీ చేస్తున్న దొంగల ముఠాను సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్, ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్, ముత్తులతో కలిసి వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా, తంగేడకు చెందిన గుంజి రామాంజనేయులు, గోగుల గోపాలకృష్ణ, షేక్ కిసినాపల్లి భాష నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చాకచక్యంగా పిన్నీస్‌తో తాళం తీసి దొంగిలించేవారు. మంగళవారం ముగ్గురు కలిసి రెండు బుల్లెట్‌లపై రామ్‌కోఠి చౌరస్తా మీదుగా వెళ్తుండగా తనిఖీలు నిర్వహిస్తున్న సుల్తాన్‌బజార్ పోలీసులు వాహనాలకు సంబంధించిన పత్రాలు అడగడంతో వారు పొంతనలేని సమాధానం చెప్పారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా తరచూ గుంటూరు నుంచి నగరానికి వచ్చి ఇక్కడ ద్విచక్ర వాహనాలను దొంగిలించి తక్కువ ధరకు రాంకోఠిలో సెకండ్ హ్యాండ్ దుకాణాల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. సుల్తాన్‌బజార్ పరిధిలో ఒకటి, టూ టౌన్‌లో మరో బుల్లెట్, సూర్యాపేట్ చింతలపాలెం పీఎస్ పరిధిలో ఒకటి చోరీ చేసినట్లు గుర్తించారు. వారి నుంచి ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు యజమానులకు సమాచారం అందించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్ ముత్తు, డీఎస్ఐ నరేష్‌లను డీసీపీ రావుల గిరిధర్ అభినందించారు.

బీసీ ఉద్యోగులకు రిజర్వేషన్లు కల్పించాలి


బీసీ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

గన్‌ఫౌండ్రీ: బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లను కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీలపై విధించిన క్రిమిలేయర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బదిలీలు, పోస్టింగ్‌లలో బీసీలకు వాటా దక్కాల్సిందేనన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పిస్తే తప్పా.. దేశంలో బీసీలకు న్యాయం జరగదని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వంలో బీసీ ఉద్యోగులకు అన్యాయం జరిగిందని నూతన ప్రభుత్వం బీసీ ఉద్యోగులకు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాలచారి, ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌గౌడ్, బీసీ ఉద్యోగ సంఘాల నాయకులు రమా, రాధారాణి, ఆంజనేయులు, యుగేందర్ వివిధ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గోల్కొండ: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు తమ సంస్థ ఎప్పుడూ.. కృషి చేస్తుందని మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ బి.వి.కే.మూర్తి అన్నారు. నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మంగళవారం ఓ ప్రకటనలో ఆయన తెలిపారు. ప్రయాణికులు తమ అభిప్రాయాలు, సూచనలు ఈ కార్యక్రమంలో నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. బస్సురూట్స్‌పై అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని స్పష్టం చేశారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ప్రయాణికులు తనను సంప్రదించవచ్చునని ప్రకటించారు. సంప్రదించవలసిన వారు 9959226133.

వ్యక్తి మృతదేహం స్వాధీనం



గౌలిపురా: లాల్‌దర్వాజా మోడ్ ప్రాంతంలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఎస్.కృష్ణకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. లాల్‌దర్వాజా మోడ్ మెగా టైలర్ సమీపంలో ఈనెల 26న ఉదయం 8.40 గంటల సమయంలో 60 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకుని చుట్టు పక్కల విచారణ చేపట్టగా.. అతడి పేరు పాషాగా... లాల్‌దర్వాజా పరిసర ప్రాంతాల్లో లేబర్ పని చేసుకుంటాడని తెలిసింది. దీంతో మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులు 040–27854783 నంబరుకు సమాచారం అందించాలన్నారు.

బాలుడి అదృశ్యం


షేక్ అవైస్ (ఫైల్)

నాంపల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమైన ఘటన మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసబ్‌ట్యాంక్ ప్రాంతంలో నివాసం ఉండే షేక్ ఇబ్రహీం వృత్తిరీత్యా డ్రైవర్. కాగా అతడికి నలుగురు కుమారులు సంతానం. రెండో కుమారుడు షేక్ అవైస్ (17) మెహిదీపట్నంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో పదోతరగతిలో ఫెయిల్ అయ్యాడు. ప్రస్తుతం సప్లిమెంటరీ పరీక్షలు రాయాల్సి ఉంది. సోమవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి స్నేహితులతో కలిసి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నూకర్ పార్లర్ నిర్వహిస్తున్న వ్యక్తికి రెండ్రోజుల జైలు


నిందితుడు నిఖిల్‌సింగ్

అబిడ్స్: అర్ధరాత్రి దాటే వరకు స్నూకర్ పార్లర్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తికి రెండ్రోజుల జైలుశిక్ష విధిస్తూ.. నాంపల్లి కోర్టు తీర్పునిచ్చింది. మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రహీంపుర వద్ద ఉన్న ఎస్‌కే జిమ్‌లో అర్ధరాత్రి దాటినా స్నూకర్ పార్లర్‌ను నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సోమవారం రాత్రి మంగళ్‌హాట్ పోలీసులు దాడి నిర్వహించి పార్లర్ యజమాని నిఖిల్ సింగ్‌ను అరెస్టు చేశారు. నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా రెండ్రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు నిచ్చినట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

'నిధి ఆప్కే నికత్ 2.0' పై అవగాహన


మాట్లాడుతున్న కమిషనర్ రవితేజకుమార్‌రెడ్డి

విజయనగర్‌కాలనీ: ప్రావిడెంట్ ఫండ్ సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు రిజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ – 1 సి.రవితేజ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రైవేటు సెక్టార్లలో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు పదవీ విరమణ చెందుతున్న ఉద్యోగులకు అదే నెలలో పెన్షన్ మంజూరు చేసేందుకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (పీపీఓ) అందజేసేందుకు మంగళవారం నిధి ఆప్కే నికత్ 2.0 పేరిట ఆసిఫ్‌నగర్ ఎంఎస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ ట్రస్ట్ సంస్థలో పెన్షన్ పేమెంట్ ఆర్డర్ పీపీఓను అందజేశామన్నారు. పీఎఫ్ సమస్యను పరిష్కరించేందుకు కేవైసీ, క్లైమ్ సెటిల్‌మెంట్, పేరు, పుట్టిన తేదీ తదితర సవరణలను పరిష్కరించేందుకు తాము కృషి చేస్తున్నట్లు వివరించారు. ఆర్‌పీఎఫ్‌సీ-2 ఆర్.వివేక్‌రామన్‌రెడ్డి, జిల్లా నోడల్ అధికారి కొండ మురళీధర్, ఎంఎస్ ఎడ్యుకేషనల్ ట్రస్టు హెచ్ ఆర్ మేనేజర్ అంబా, ఈఎస్ఐసీ మేనేజర్ మహ్మద్ జహిరుద్దీన్‌ఖాన్‌లతో పాటు ఎంఎస్ ఎడ్యుకేషన్ ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన గోల్కొండ మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చెక్కుల జారీలో ఆలస్యమైందన్నారు. గతంలో మంజూరైన చెక్కులను విడతల వారీగా విడుదల చేస్తున్నామన్నారు. అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవసరమైన ధ్రువపత్రాలను తప్పనిసరిగా జతచేయాలని ఆయన కోరారు. దళారుల జోలికి వెళ్లకుండా నేరుగా దరఖాస్తు చేసుకునేలా చూడాలని కోరారు. మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, వజీఉజ్జమా సిద్ధిఖి, అమీరుద్దీన్ తదితరులున్నారు.

విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుత ఫలితాలు


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

గోల్కొండ: విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తారని గోల్కొండ ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.ఎస్.అనురాధాదేవి అన్నారు. యూత్ ఫర్ సేవా ఎన్‌జీఓ ఆధ్వర్యంలో జరిగిన సైన్స్‌ఫెయిర్‌లో గోల్కొండ పాఠశాలకు చెందిన విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులను పాఠశాలలో అభినందించారు.

'ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న కాంగ్రెస్'


రాజేందర్

చాంద్రాయణగుట్ట: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నిలబెట్టుకుంటున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ అన్నారు. ప్రజాపాలనలో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను ప్రారంభించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెల్లరేషన్ కార్డు కలిగిన వారందరికీ 200 యూనిట్ల లోపు వినియోగించే వారికి ఉచిత విద్యుత్‌తో వెలుగులు నింపడం జరుగుతుందన్నారు. ఈ పథకంతో మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నామన్నారు. త్వరలోనే మరిన్ని గ్యారంటీలను అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నారన్నారు.

శ్రీపాదరావు జయంతి వేడుకలపై హర్షం



సుల్తాన్‌బజార్: ఉమ్మడి ఏపీ రాష్ట్ర మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి తులసి శ్రీనివాస్ తెలిపారు. మార్చి 2న శ్రీపాదరావు జయంతిని అధికారికంగా జరిపేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు సీఎం, మంత్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీ పాదరావు విగ్రహాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫెడరేషన్ కార్యదర్శి నందిరాజు లక్ష్మీనారాయణ, బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుడ్డు సుబ్రమణ్యం, నాయకులు శ్రీనివాస్‌రావు, వంశీ, ద్రోణంరాజు, రవికుమార్, సుబ్బారావు, మంగపతి రావు, వైష్ణవి ప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వారికే ప్రాధాన్యం


అనిల్‌కుమార్‌యాదవ్‌తో సత్యనారాయణ

గోల్కొండ: కాంగ్రెస్ పార్టీలో పని చేసే వారికి ప్రాధాన్యం ఉంటుందని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. రాజ్యసభ సభ్యుడుగా ఎంపికైన ఆయనను షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు డి.సత్యనారాయణ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎం.అనిల్‌కుమార్‌యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

మీడియా అకాడమీ చైర్మన్‌కి సన్మానం


శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న సంపత్‌కుమార్

సుల్తాన్‌బజార్: జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడతానని మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రముఖ సంఘ సేవకులు సంపత్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ... ప్రభుత్వం తనపై ఉంచిన బాధ్యతను నెరవేరుస్తానన్నారు. జర్నలిస్టుల సమస్యలపై తనకు అవగాహన ఉందని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

దీపాదాస్ మున్షీకి..


మున్షీని సత్కరిస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని టీపీసీసీ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మేరు కులస్తులకు పాలక మండలి, ఇతర పదవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మేరు కులస్తులకు సీట్లు ఇవ్వాలని ఆమెకు మెమోరాండం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ.... రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది ఉన్న మేరు కులస్తులకు కాంగ్రెస్ పార్టీ పదవులు అప్పగించి ఆదుకోవాలని కోరారు.

సౌత్ రైల్వే అడిషనల్ డివిజన్ మేనేజర్‌కు..



చార్మినార్: పాతబస్తీలోని యాకుత్‌పురా రైల్వేస్టేషన్ అభివృద్ధికి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారని, దీనికోసం అవసరమైన ఏర్పాట్లు చేసి భవిష్యత్తులో నిర్వహించనున్న అభివృద్ధి పనులను చక్కగా పర్యవేక్షించాలని, దక్షిణ మధ్య రైల్వే అడిసనల్ డివిజనల్ మేనేజర్ ఎం.ఎ.రెహ్మాన్‌ను ఘనంగా సన్మానించినట్లు బీజేపీ నేత మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు.

ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్‌కు..


డీసీపీ రావుల గిరిధర్‌ను సన్మానిస్తున్న ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు

సుల్తాన్‌బజార్: శాంతి భద్రతలను ఉల్లంఘిస్తే సహించేదిలేదని ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం భజరంగ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో డీసీపీ రావుల గిరిధర్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈస్ట్‌జోన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో లా అండ్ ఆర్డర్‌ను క్రమపద్ధతిలో పెట్టేందుకు కృషి చేస్తానన్నారు. దోపిడీలు, దొంగతనాలు చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. మార్కెటింగ్ ప్రాంతాల్లో బ్లాక్ మార్కెటింగ్‌ను అడ్డుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యాపారాలు నడుచుకోవాలని సూచించారు.